క్లుప్తంగా

12న మాలల మహా రణభేరి



పాత యింజరంలో సమావేశమైన మాల మహానాడు సభ్యులు

ఐ.పోలవరం: ఈ నెల 12 కాకినాడలో జరిగే మాలల మహా రణభేరిని విజయవంతం చేయాలని మండల మాలమహానాడు పిలుపు నిచ్చింది. శనివారం పాత యింజరం అంబేడ్కర్ విగ్రహం వద్ద మండల మాలమహానాడు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలలకు వెన్నుపోటు పొడిచేలా చంద్రబాబు సర్కార్ ప్రయత్నిస్తోందన్నారు. కుట్రపూరితంగా వర్గీకరిస్తే చూస్తూ ఊరుకోమని, మహారణభేరి సభకు అధిక సంఖ్యలో మాలలు తరలి రావాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో కాశి పరివాజ్‌కుమార్, రేవు శ్రీను, వడ్డి గౌతమ్ ఉన్నారు.

విద్యార్థినికి డీఈవో అభినందన



హెబ్సిబను అభినందిస్తున్న డీఈవో బాషా తదితరులు

అమలాపురం టౌన్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో అమలాపురం మండల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని షైనీ హెబ్సిబను డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా అభినందించారు. ఆ పాఠశాలలో శనివారం జరిగిన అభినందన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ షైనీ 600 మార్కులకు 585 సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. విజేతను సత్కరించి జ్ఞాపకను అందజేసి అభినందించారు. పాఠశాల హెచ్ఎం గౌరీ శంకర్, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

22న హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్ర కర పత్రాలను విడుదల చేస్తున్న మోనిక, పార్టీ నాయకులు

అమలాపురం టౌన్: ఈ నెల 22న విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో జరగనున్న హనుమాన్ జన్మదిన విజయోత్సవ శోభాయాత్ర బైక్ ర్యాలీ కర పత్రాలను తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యదర్శి సుంకర మోనిక శనివారం విడుదల చేశారు. స్థానిక కాలేజీ రోడ్డులోని త్రిముఖ గణపతి ఆలయంలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బైక్ ర్యాలీలో ప్రతి హిందువూ పాల్గొని హిందూ ధర్మ పరిరక్షణకు పాటు పడాలని ఆమె పిలుపు నిచ్చారు. భజరంగ్ దళ్ రాష్ట్ర నాయకుడు శిరంగు నాయుడు, వీహెచ్‌పీ నాయకులు ఊటుకూరి సాంబయ్య, గంగుమళ్ల దొరబాబు, కాళ్లకూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ



జి.వేమవరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

తాళ్లరేవు: జి.వేమవరం గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన దుర్గాదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. స్థలదాత లెంక రామన్నపాత్రుడు, ఆలయ ధర్మకర్తలు యర్రంనీడి నాగేశ్వరరావుల పర్యవేక్షణలో మూడు రోజుల పాటు ఉత్సవాలు జరిగాయి. శనివారం వేద పండితులు సాలగ్రామ వీర వెంకట సత్యనారాయణ స్వామి నేతృత్వంలో రుత్విక్కులు శ్రీరామ్, వెంకట శర్మ, సాయి శర్మ అఖిల్ శర్మ తదితరులు ఉదయం గణపతిపూజ, గర్గన్యాసం, ధాతున్యాసం నిర్వహించారు. అనంతరం గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప విగ్రహాలతో పాటు అమ్మవారి విగ్రహాన్ని 10.08 నిమిషాలకు ప్రతిష్ఠించారు. అనంతరం గోదృష్టి, పూర్ణాహుతి, ఆశీర్వచనం, భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. భారీ అన్నదాన చేశారు. సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు యర్రంనీడి అప్పారావు, నాయకులు పుణ్యమంతుల సత్తిబాబు, లెంక భాస్కర్, అనూష తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

అయినవిల్లి: గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఈ నెల 26న అయినవిల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... అయినవిల్లి గ్రామానికి చెందిన కేశనకుర్తి తిరుపతిరావు (40) ఈ నెల 26న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి రాలేదన్నారు. బంధువులు, స్థానికంగా ఆచూకీ తీసిన లభ్యం కాలేదన్నారు. శనివారం యానం గోదావరి నదిలో అతడి మృతదేహం లభ్యమైందన్నారు. దీనిపై మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

వైద్య సేవలకు జిప్‌మెర్ సన్నద్ధం

- రూ.48.85 కోట్లతో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం
- అమలవుతున్న ఓపీ సేవలు
- ఇన్ పేషెంట్ సేవలకు ప్రజల వినతి
- ఆంధ్ర ప్రదేశ్ సాయంతో రెసిడెంట్ వైద్యులు, డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రామ్ అమలుకు యత్నాలు
- పూర్తి సేవలకు 100 మంది నర్సులు, 30 మంది వైద్యుల అవసరం



కోట్లాది రూపాయిల ఖర్చుతో నిర్మించిన జిప్‌మెర్ ఆసుపత్రి

యానాం: స్థానిక జిప్‌మెర్ (జవహర్‌లాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) మల్టీ స్పెషాలిటీ కన్సల్టింగ్ యూనిట్ ఏర్పాటుతో ప్రజలకు త్వరలో మెరుగైన, నాణ్యమైన ఉచిత వైద్యం అందనుంది. యానాంతో పాటు తూర్పుగోదావరి జిల్లా పరిసర ప్రాంతాల్లోని పేద వర్గాలకు దీర్ఘకాలిక వ్యాధులు, ప్రాణాంతక వ్యాధుల వైద్యానికి వ్యయ, దూరాభారాలు తగ్గనున్నాయి. గుండె, కేన్సర్, కిడ్నీ, కాలేయం తదితర దీర్ఘకాలిక వ్యాధులకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రిలో ఓపీ సేవలతో పాటు ఇన్ పేషెంట్ సేవలు అమలులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. 2023 లో ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తయినా సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు.

రూ.48.85 కోట్లతో నిర్మాణాలు

కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.48.85 కోట్లతో 2020 జూన్‌లో ఆస్పత్రి నిర్మాణ పనులు ప్రారంభించారు. రికార్డు సమయంలో నిర్మాణాన్ని పూర్తిచేశారు. వైద్య పరికరాలకు సైతం రూ.కోట్లు వ్యయం చేశారు. అలాగే సీటీ స్కాన్ మెషీన్ కొనుగోలుకు రూ.5 కోట్లకు అనుమతి వచ్చింది. దీనికి తోడు ప్రస్తుతం ఆల్ట్రా స్కానింగ్, ఈసీజీ, ఎక్స్‌రే మెషీన్లను ఏర్పాటు చేశారు.

ఓపీతో పాటు ఇన్ పేషెంట్ సేవలు

గత ఏడాది నుంచి అవుట్ పేషెంట్ సేవలు అమలవుతున్నప్పటికీ, ఇన్ పేషెంట్ సేవలు అమలు చేయకపోవడంతో దీర్ఘకాలిక, అత్యవసర వైద్యసేవలు అందడం లేదు. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో ఇన్ పేషెంట్ సేవలు అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వైద్యుల నియామకం పూర్తిస్థాయిలో జరగకపోవడం తదితర పరిణామాల నేపథ్యంలో సేవలు సైతం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకుండా పోయాయి. జిప్‌మెర్‌లో 100 మంది నర్సులు, 30 మంది వైద్యుల ఉండాల్సి వుంది. కాని ప్రస్తుతం 25 మంది నర్సులు, 9 మంది వైద్యులు ఉండటంతో ఇన్ పేషెంట్ సేవలకు జాప్యం అవుతోంది. మే 15నుంచి డయాలిసిస్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఇప్పటికే ఆర్ఓ ప్లాంట్ సైతం పూర్తయ్యిందని చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆనంద్ రాజ్ తెలిపారు.

ఏపీ వైద్యుల సహాయానికి వినతి

ఆస్పత్రిలో వైద్య సేవలు అందించడానికి పుదుచ్చేరి ప్రభుత్వం ఏపీ ప్రభుత్వం సహాయం కోరింది. ఇటీవలి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో జిప్‌మెర్ డైరెక్టర్ వీర్‌సింగ్ బృందం ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యమంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులతో చర్చించింది. యానాంతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న లక్షలాది ప్రజల వైద్యసేవలకు జిప్‌మెర్ ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. ముఖ్యంగా అనిస్థీషియా, గైనిక్, పిల్లల వైద్యం, ఆపరేషన్ల కోసం ఏపీలోని వివిధ ప్రభుత్వ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల్లో వైద్యులను, నర్సుల్ని నియమించాలని ఏపీ ప్రభుత్వాన్ని జిప్‌మెర్ డైరెక్టర్ నేగీ కోరారు. ఈ మేరకు ఇటీవలి విజయవాడలో సమావేశమయ్యారు.

ఆంధ్రప్రదేశ్ సాయం కోరాం



జిప్‌మెర్‌లో వైద్యసేవలు అందించడంలో భాగంగా నిపుణులైన వైద్యులను ఆస్పత్రికి పంపేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహాయం కోసం ఆ రాష్ట్ర మంత్రి, వైద్యాధికారులతో సమావేశం జరిగింది. నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు ఈ మేరకు నివేదిక పంపనున్నారు. అనంతరం సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యులను యానాం జిప్‌మెర్‌కు పంపేలా చర్యలు తీసుకుంటారు

– డాక్టర్ ఆనంద్‌రాజ్, చీఫ్ మెడికల్ ఆఫీసర్, జిప్‌మెర్, యానాం

ఉచిత సీట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

అల్లవరం: విద్యా హక్కు చట్ట ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరే పేద విద్యార్థులకు 25 శాతం లాటరీ విధానంలో కేటాయించనున్నట్టు ఎంఈఓ కిరణ్‌బాబు శనివారం తెలిపారు. ఉచిత సీట్ల కోసం మే 2 నుంచి 19వ తేదీ వరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. విద్యార్థి ఆధార్, తల్లిదండ్రుల ఆధార్, రేషన్‌కార్డు, విద్యార్థి గుర్తింపు కార్డు, పిల్లల వయసు ధ్రువీకరణ పత్రాలతో పాటుగా మే 31 నాటికి ఐదేళ్లు నిండిన పిల్లలకు ఈ అవకాశం ఉంటుందన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, జాబు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, కరెంటు బిల్లు, అద్దె ఒప్పంద పత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పించాల్సి ఉందన్నారు. ఆసక్తి గల తల్లిదండ్రులు http://cre.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారానికి 18004258599 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చని ఎంఈఓ తెలిపారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

తాళ్లరేవు: పీపీఎల్ దాసరి రవిరాజు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం పటవలలో ప్రారంభం కానుంది. పటవల జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ టోర్నీని కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ ప్రారంభిస్తారని ఆర్గనైజర్ చెక్కా అజయ్ వర్మ తెలిపారు. నాకౌట్ దశలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

వసతి గృహాల్లో మలేరియా అధికారి తనిఖీలు



వసతి గృహంలో దోమల మందును పిచికారీ చేయిస్తున్న జిల్లా మలేరియా అధికారి నిల్సన్

తాళ్లరేవు: మండల పరిధిలోని కోరంగి పంచాయతీలో ఉన్న బాలుర, బాలికల వసతి గృహాలను జిల్లా మలేరియా అధికారి డాక్టర్ నిల్సన్ తనిఖీలు చేశారు. హాస్టళ్ల పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దోమల బెడద లేకుండా మందును పిచికారీ చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల తెరలు వాడేలా చూడాలని సిబ్బందికి పలు సూచించారు. ఈ కార్యక్రమంలో తాళ్లరేవు పీహెచ్‌సీ వైద్యులు ఈశ్వర్, సబ్‌యూనిట్ ఆఫీసర్ యాతం నాగ బాబు, ఎంపీహెచ్ఈఓ బొడ్డు కుమార్, హెచ్ఎస్ రంజన్, ఏఎన్ఎం వసంత, హెల్త్ అసిస్టెంట్‌లు కె.ఆంజనేయులు, గోవిందు, త్రిమూర్తులు ఆశాలు పాల్గొన్నారు.

నీట్ పరీక్షపై నేడు ఎల్జీ సమీక్ష

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ రీజియన్‌లలో 12 సెంటర్లలో ఆదివారం జరుగనున్న నీట్ పరీక్ష ఏర్పాట్లపై శనివారం ఎల్జీ కె.కైలాశనాథన్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు ఆయా సెంటర్లలో తాగునీటి వసతి, రవాణా సదుపాయాల గురించి తెలుసుకున్నారు. జిల్లా మెజిస్ట్రేట్ ఆధ్వర్యంలో కమిటీని నియమించినట్లు, అదే విధంగా పరీక్ష పత్రాలను ఆయా కేంద్రాలకు భద్రంగా చేరవేసే బాధ్యత తీసుకున్నట్టు తెలిపారు. నాలుగు రీజియన్లలోను 5,230 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారన్నారు. సమావేశంలో అధికారులు పంకజ్ కుమార్ ఝా, పోలీస్ అధికారి అశోక్‌కుమార్ సింగ్లా, అధికారులు పాల్గొన్నారు.

సెపక్ తక్రా వేసవి శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న తాతబాబు తదితరులు

అమలాపురం రూరల్: స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల క్రీడా స్థలంలో నెల రోజుల పాటు ఏర్పాటు చేసిన వేసవి ఉచిత సపక్ తక్రా క్రీడా శిక్షణను ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అసోసియేన్ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు విజ్ఞప్తి చేశారు. ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఆ క్రీడా శిబిరాన్ని శనివారం ఉదయం ఆయన ప్రారంభించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సురేష్ మాట్లాడుతూ జిల్లాలో తక్కువగా ఉన్న సపక్ తక్రా క్రీడాకారులు ఈ శిబిరం ద్వారా మరింతమంది తయారుకావాలని ఆకాంక్షించారు. శిబిరానికి కోచ్‌లుగా యాంద్ర గౌతమ్, కేతా సతీష్ వ్యవహరించనున్నారు. శిబిరానికి అవసరమైన బాల్స్, నెట్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు తాతబాబు సమకూర్చి క్రీడాకారులకు అందజేశారు. సపక్ తక్రా సీనియర్ నేషనల్ మెడలిస్ట్ మంచాల చందు పర్యవేక్షణలో ఈ శిబిరం జరగనుంది. విశ్రాంత పీఈటీ, సపక్ తక్రా క్రీడా నిపుణుడు మునగాల మన్యం, ఇందుకూరి శ్రీధర్ వర్మ, తోట రాము, రమేష్, జీవీ బాబు, పీడీలు బి.చిరంజీవి, కేఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

కిటకిటలాడిన వేంకటేశ్వరుని ఆలయాలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. దీంతో మండలంలోని చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

వేంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసీ పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కుల గణనపై బీఎస్పీ హర్షం



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఎస్పీ జిల్లా నాయకులు

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు బీసీ కుల గణన జరపాలని నిర్ణయించడం వెనుక బీఎస్పీ సుదీర్ఘ పోరాటం ఉందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కుసుమ వెంకటేశ్వరరావు అన్నారు. బీసీలకు కుల గణనపై ఆ పార్టీ హర్షం వ్యక్తం చేస్తూనే తమ పార్టీ చేసిన పోరాటాల వల్లే కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు అమలు చేస్తోందని పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ చిల్డ్రన్ పార్కు వద్ద గల మహాత్మా పూలే విగ్రహానికి బీఎస్పీ నాయకులు శనివారం నివాళులర్పించి, ఇది బీఎస్పీ విజయమని నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఇన్‌చార్జి కాశి లక్ష్మీ భవాని, జిల్లా ఉపాధ్యక్షుడు వాకపల్లి భీమారావు, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు తదితరులు పాల్గొని కుల గణన గురించి మాట్లాడారు.

కిమ్స్‌లో వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

అమలాపురం: కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో శనివారం స్వామివారికి అర్చన, లక్ష్మీ హోమం, నీరాజనం, మంత్రపుష్పం నిర్వహించారు. అనంతరం స్త్రీలందరిచే సామూహిక కుంకుమార్చన జరిపారు. సాయంత్రం స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండగగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. ఆదివారం సుదర్శన హోమం, పూర్ణాహుతి, చక్రస్నానం నిర్వహించనున్నట్టు కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు తెలిపారు.

ఆధునిక వైద్య పద్ధతులపై అవగాహన



మండపేటలో పీఎంపీలతో మాట్లాడుతున్న వైద్యుడు

కపిలేశ్వరపురం (మండపేట): ఆధునికంగా ఉనికిలోకి వస్తున్న వైద్య పద్ధతులపై ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్స్‌కు అవగాహన అవసరమని పలువురు వైద్యులన్నారు. మండపేట టౌన్ హాల్‌లో శనివారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన తరగతిని నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని జీవీఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ రామ్ గోపాల్‌తేజ, న్యూరోసర్జన్ డాక్టర్ అద్దేపల్లి శ్యామ్‌సుందర్, గైనకాలజిస్ట్ డాక్టర్ మాణిక్యాంబలు వారి వారి వైద్య విభాగాలపై పీఎంపీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ నాయకులు మట్టా వీరబాబు, బీవీ రమణ, ఇరవాడ రవికుమార్, వీకే రాజు, బళ్ళా శ్రీనివాస్, కోన సత్యనారాయణ పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

యానాం: నియోజకవర్గ పరిధిలో ప్రైవేట్ స్కూల్స్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు పుదుచ్చేరి ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను మించి వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్లకు మూడేళ్ల క్రితం నిర్ణయించిన ఫీజులకు మించి వసూలు చేస్తున్నారని పలువురు తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, తక్షణం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలని ఆయా యాజమాన్యాలను కోరారు.

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన

ఆలమూరు: అశ్రద్ధ వహిస్తే ప్రాణాంతకంగా రూపాంతరం చెందే సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణ పరీక్షలను వైద్యారోగ్య సిబ్బంది శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సాయికిషోర్, కె.శ్రీకాంత్ నేతృత్వంలో ఆరోగ్య, ఆశ సిబ్బంది వలస కార్మికులకు ఈ పరీక్షలు నిర్వహించారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి వంశ పారంపర్యంగా సంభవించే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎర్ర రక్తకణాలు కొడవలి ఆకారంలో మారి రక్తనాళాలలో ప్రయాణం చేయలేక శరీరంలో నొప్పులు ఎక్కువ అవుతాయని వివరించారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా అక్కుల, బి.సూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

భూసారం కోల్పోనివ్వవద్దు

- గడ్డిని కాల్చకుండా భూమిలో దున్నితే ప్రయోజనం
- సూక్ష్మ పోషకాలు నశించడంతో దిగుబడిపై ప్రభావం
- అధునాతన యంత్రాలతో గడ్డి సేకరించాలి



పెనికేరులో పొలంలో తగులబడుతున్న ఎండు గడ్డి

ఆలమూరు: ఖరీఫ్, రబీ సీజన్‌లో అనేక మంది రైతులు వరికోత యంత్రాలనే వినియోగిస్తున్నారు. దీనివల్ల ఎండుగడ్డికి తీవ్ర కొరత ఏర్పడుతుంది. గడ్డికి డిమాండు ఎక్కువగా ఉన్నా కోత యంత్రాలతో మాసూళ్లు చేయడం వల్ల వాటి లభ్యత అంతంత మాత్రమే ఉంటుంది. పాడిపశువులు లేని రైతులు పొలాల్లో గడ్డి నలిగిపోవడం వలన పశువులకు పనికిరాదన్న ఉద్దేశంతో ఎండుగడ్డిని పొలాల్లోనే తగలబెడుతున్నారు. దీనివలన భూసారానికి తీవ్ర నష్టం కలుగుతుందని, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని వ్యవయసాయశాఖ చెబుతుంది. ఆ గడ్డిని పొలంలోనే ఉంచి దమ్ముల సమయంలో కలిపిదున్నడం ద్వారా భూమికి మేలు జరుగుతుందని చెబుతున్నారు. ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన స్ట్రాబేలర్ యంత్రాలను వినియోగించి ఎండుగడ్డిని సంరక్షించుకోవాలని సూచిస్తున్నారు. పొలాల్లో నలిగిన గడ్డిని యంత్రం ద్వారా మోపులుగా సేకరించి పశుగ్రాసంగా వినియోగించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు స్ట్రాబేలర్ యంత్రాన్ని వినియోగించి గడ్డిని సేకరించడం ద్వారా రైతులకు కొద్దిమేర ఆదాయం లభిస్తుంది. వరి కోత యంత్రాల ద్వారా లభ్యమైన గడ్డిని ఏదో విధంగా సద్వినియోగం చేసుకోవాలే తప్ప కాలబెట్టడం సరికాదనే అభిప్రాయాన్ని వ్యవసాయశాఖ అధికారులు వివరిస్తున్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల పరిధిలో సుమారు 58 వేల ఎకరాల్లో రబీ సీజన్‌కు సంబంధించి వరి సాగు జరిగింది. ఇప్పటికే సుమారు 80 శాతం మేర జిల్లాలోని వివిధ మండలాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. ఇటీవల కాలంలో వరికోత యంత్రాలతో మాసూళ్లు చేయడం వల్ల గడ్డి పనికి రాకుండా పోతుందని రైతుల అభిప్రాయంగా ఉంది. కోత కోసినప్పుడు గడ్డి నలిగిపోతుందని, దీంతో పశువులు ఆ గడ్డిని తినేందుకు అంతగా ఇష్టపడవని రైతులు భావిస్తున్నారు. పశుగ్రాస అవసరాలకు ఉపయోగపడదనే ఉద్దేశంతో ఈ గడ్డిని పొలాల్లోనే తగులబెట్టడం పరిపాటిగా మారింది. ఈ గడ్డి తగుల బెట్టినప్పుడు వేడిగాలులతో సమీపంలోని ప్రజలు, రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. మంటలు ఒక పొలం మీదుగా మరో పొలానికి వ్యాపిస్తూ ధాన్యపు రాశులతో పాటు పొలాల్లో దిమ్మలపై ఉంచిన గడ్డివాములు నిప్పంటుకుని బూడిదైన ఘటనలు గతంలో ఎన్నో ఉన్నాయి. గడ్డిని తగలబెట్టకుండా దమ్ములో కలిపి దున్నడం ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని వ్యవసాయాధికారులు అంటున్నారు. గడ్డిని కాల్చకుండా దున్నడ ద్వారా కలిగే ప్రయోజనాలు, చేలకు సంభవించే భూసారం వివరాలను రైతులకు అవగాహన కల్పిస్తూ ఇప్పటికే వ్యవసాయశాఖ సదస్సులను ఏర్పాటు చేస్తుంది.



ఎండుగడ్డి నుంచి వెలువడుతున్న పొగలు

భూసారానికి అపార నష్టం

ఆరోగ్యవంతమైన భూమిలోని ఒక గ్రాము మట్టిలో టెన్ టూ ది పవర్ ఆఫ్ నైన్ (10,00000000) సూక్ష్మజీవులు ఉంటాయి. భూమిలో కుళ్లిన పదార్థాన్ని ఇవి ఆహారంగా తీసుకుని మొక్కలకు అవసరమైన సూక్ష్మ పోషకాలను అందిస్తుంటాయి. పొలాల్లోని గడ్డిని కాల్చివేయడం వలన ఈ సూక్ష్మజీవులు చనిపోయి భూసారానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఇలాంటి పరిస్థితుల వలనే గతంలో రైతులు ఎప్పుడు విని యోగించని జింకు, బోరాన్ తదితర చిన్నచిన్న సూక్ష్మ పోషకాలను పొలాల్లో నేరుగా వేయాల్సి వస్తుంది. గడ్డిని తగులబెట్టకుండా పొలంలోనే కుళ్లించి నేలలో కలిపి మురుగు దమ్ము చేస్తే చక్కని ఫలితం ఉంటుంది. ఈ విధంగా చేసేటప్పుడు దమ్ముకు దమ్ముకు మధ్య వారం రోజులు వ్యత్యాసం ఉండాలి. దీనివలన ఈ గడ్డి బాగా కుళ్లి భూమిలో కలిసిపోయి మొక్కలకు అవసరమైన సూక్ష్మపోషకాలు సమృద్ధిగా అందుతాయి.